# జీవన సమాధులు

రచన :
శ్రీమతి ఎస్. సి. శాయిలీల, బి. ఏ.

[వృద్ధాప్యం వచ్చి తమ బాధ్యతలు పూర్తి చేసుకుని ఈ ప్రపంచంలోంచి వెళ్ళిపోయినవారి జీవితాలు వేరు. వృద్ధులు పండిపోయిన పండులాంటి వారు. పూర్తిగా పుష్పించి వడిలిపోయిన పువ్వువంటి వారు.

పచ్చికాయలాంటి వారు చిన్నతనంలో ఈ లోకాన్ని విడిచినవారు. నాకు తెల్సిన ఆడవాళ్ళు ఎంతో మంది అతి చిన్నవయస్సులో ముప్పైకూడా రాకుండా చనిపోయినవారి జీవితాలు కళ్ళారా చూసి నా ఊహతో వ్రాసిన కథ ఇది. పూర్తిగా విచ్చుకోకుండా రాలిపోయిన పువ్వులలాంటి యువతులకి నా ఈ కథ అంకితం.

—రచయిత్రి]

రాత్రి నిశ్శబ్దంగా వుంది శ్మశానం. కాకట్లో కొండ మీద పెద్ద శ్మశానం ఇదే. మిగతా ఒకటీ, రెండూ చిన్న చిన్నవి వున్నాయి కాని వూళ్ళో ఎక్కువ జనం దీన్నే వాడుకుంటూ వుంటారు. రాత్రి బాగా చీకటి పడింది. జన సంచారము ఎక్కడా లేదు. రెండు, మూడు చోట్ల ఏవో చితులు మండుతున్నాయి. హఠాత్తుగా వెక్కి వెక్కి ఏడుస్తున్న ఏడుపువిని తల యెత్తి అటు ఇటూ చూసి తన ప్రక్కనే పదిగంటలకి ప్రొద్దున్న ఎవరో స్త్రీని కాల్చి వెళ్ళిపోయారు వాళ్ళ వాళ్ళు. పాపం, ఆ స్త్రీ ఏడుస్తోంది కాబోలు, తనవాళ్ళు గుర్తుకొచ్చారేమో! ఏడవనీ కాస్సేపు. ఆ మనస్సులోని బాధ అంతా బయటికి నీటి రూపాన పోవాలి అనుకుని ఇంకా గట్టిగా ఏడుస్తున్న ధ్వనివిని 'చూడు! ఎందు కేడుస్తున్నావ్? నీ పిల్లలు గుర్తుకొచ్చారా? లేక మీ ఆయనా? పాపం! చిన్నదానివే, ప్రొద్దున్న నిన్ను ఇక్కడికి తీసుకొచ్చినప్పుడు చూసాను. అప్పుడే నా కళ్ళు నిండిపోయాయి. ఏం చేస్తాం? మనకి భూమి మీద నూకలు చెల్లిపోయాయి. అలా అనుకోవాలి తప్పదు, ఏడవకు' అంటూన్న మాటలు విని ఎవరో తనని చూసి మాట్లాడుతున్నట్లనిపించి పైకి చూసాను. జాలితో నిండిన ఆ చూపులు చూసి తిరిగి ఏడ్చాను.

'నీ బాధేమిటో నాకు చెప్పు. కొంతైనా తేలికగా వుంటుంది నీకు' అన్న మాటవిని 'మధ్యలో అడ్డు మాట్లాడకుండా విను. పూర్తిగా చెప్తాను' అన్నాను.

'సుశీలా, సుశీలా, ఈ కూర తరగమని ఎన్ని సార్లు చెప్పాను. అంత బద్ధకమేమిటే' అమ్మ కేకలతో ఈ లోకంలోకి వచ్చి పుస్తకం టేబుల్ మీద పడేసి వంట ఇంట్లోకి వెళ్ళాను.

'అక్కయ్య తరగకూడ దేంటి? నేనేనా అన్ని పన్లకి' విసుక్కుంటూ తరగసాగాను.

'ఎందుకే ఆ విసుగు. దానిది పెద్ద చదువు, నీది చిన్న చదువు. దానికీ, నీకూ వంతులేమిటి? నేను చెప్పినట్లు చెయ్యడమే నీవంతు' అన్న అమ్మమాటకి ఎదురు చెప్పక పనిని ముగించి తిరిగి చదువుకోడానికి పుస్తకం తీసాను.


మా నాన్నగారికి నలుగురు అబ్బాయిలు, నలుగురు అమ్మాయిలు. చేసే ఉద్యోగం మున్సిపల్ ఆఫీసులో హెడ్ గుమాస్తా అయినా వెనుక కొంచెం ఆస్తి వున్నందువలన ఏడాదికొక ఎకరం అమ్ముతూ పిల్లల్ని చదివించారు నాన్నగారు. మా చదువుల్ని మధ్యలో ఆపలేదు, అది కొంతలో కొంతనయం. 'ఆడ పిల్లలకి పెద్ద చదువు లెందుకు, ఒక అయ్యచేతిలో పెట్టక, మగ పిల్లల్ని చదివించండి. రేపు వాళ్ళే మనల్ని చూసే దిక్కు' అని రోజూ కొకసారి అనే అమ్మమాటని అక్షరాల అబద్ధం చేసారు మా అన్నయ్యలు ముగ్గురూ. పెద్దన్నయ్య బి. ఏ. బి. ఇడి. ప్యాసై పెళ్ళి చేసుకుని కావాలని వేరేవూళ్ళో స్కూలు మాస్టరు ఉద్యోగం వేయించుకుని వెళ్ళిపోయాడు. రెండో అన్నయ్య బి. ఎ. ప్యాసై పెద్ద కంపెనీ మేనేజరు గారింటికి ఇల్లరికం వెళ్ళిపోయాడు

ఎలెన్


ELLEN ISI

మోటారు మరియు పంపులు

ఆంధ్ర ప్రభుత్వముచే అధికారము పొందియున్నది



Manufacturers of :-
Single Phase Motors, 3 Phase Motors Centrifugal Pumps, Domastic Pumps Domestic Mono Blocks and Jet Pumps, Jet Mono Blocks.



For PARTICULARS
ELLEN INDUSTRIES
Peelamedu, Coimbatore - 641 004.

: బ్రాంచి :

ఎలెన్ ఇండస్ట్రీస్

7-3-177, ఘన్‌మండి, సికిందరాబాదు-3 (ఎ. పి.)

ఇష్టపడే. మూడో అన్నయ్య ఎస్. ఎల్. సి. అయ్యాక ఎవరిని పట్టాడో ఏమిటో పెద్ద ఫ్యాక్టరీలో ఉద్యోగం సంపాదించి పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయాడు వేరే ఇంట్లోకి ఇంక నాలుగో అన్నయ్య బి. ఎస్. సి. ప్యాసై చిన్న వుద్యోగం చేస్తూ చెల్లెళ్ళ పెళ్ళి అయితేగాని పెళ్ళి చేసుకోనని చెప్పినవాడు మా చుట్టాలమ్మాయిని లవ్ చేసి అర్జంటుగా పెళ్ళి చేసేసుకున్నాడు.

ఇంక ఇంట్లో పరిస్థితి ఎలా వుండేదంటే ఎక్కడి కెళ్ళాలన్నా, రెండో దాన్నని నన్ను ఇంట్లో వుంచేసి ఇంటికి పెద్దదని అక్కయ్యని, చిన్నవాళ్ళని చెల్లెళ్ళని అందరూ పెళ్ళి, నాలుగోవదినని ఇంట్లో వుంచితే తనే మైనా అనుకుంటుందని తనని తీసుకెళ్ళేవారు. ఒక పేరంటానికి లేదు, పెళ్ళిళ్ళకు లేదు. వంటింటికుందేలు లాగా నాజీవితం గడిచిపోయింది.

'అమ్మా, మీతోపాటు నన్ను కూడ తీసుకెళ్ళండి బయటికి, ఎప్పుడూ నేనేనా ఏమిటి ఇంటికి కాపలా?' అనే దాన్ని ఎప్పుడైనా అమ్మతో 'చూడు, ఇంటికి పెద్దది అక్కయ్య. చిన్నవాళ్ళు నీ చెల్లెళ్ళు. వాళ్ళని తీసుకెళ్ళకుండా ఎలాగే. నేనొక్కదాన్ని వెళ్ళడం? నీ పెళ్ళయ్యాక నీ మొగుడు తీసుకెళ్తాడంటే, ఏం బాధ పడకు' అనేది అమ్మ. అప్పుడప్పుడు మనస్సులో వుడుక్కున్నా సరేలే నా అదృష్టం వుంటే పెళ్ళయ్యాక బయటికి వెళ్తాను మొగుడితో అనుకుని చిన్న తనపు రోజులు నెట్టుకొచ్చాను. అక్కయ్య బి. ఏ. ప్యాసైంది. మంచి సంబంధం చూసి పెళ్ళి చేసారు దానికి. మా బావగారు డాక్టరు. కట్నం వున్నంతలో ఇచ్చి ఘనంగా పెళ్ళి చేసారు. అక్కయ్య అత్తవారింటికి వెళ్ళిపోయింది.

'చూడమ్మా! మంచి సంబంధమూ హైద్రాబాద్‌లో వుందని మీ మామయ్య ద్వారా తెల్సింది. బ్యాంక్ మేనేజరుగా చేస్తున్నాడుట అక్కడే. పెద్ద కుటుంబం గాని, మంచి వాళ్ళేనని చెప్పాడు మీ మామయ్య. కట్న కానుకలు ఎక్కువ ఇచ్చుకోనక్కరలేదని చెప్పాడు. ఏమంటావ్?' అంటున్న నాన్నగారితో 'దాంతో చెప్పడమేమిటి? దాని ఇష్టం తీసుకోడమేమిటి? ఇంత కన్నా మంచి సంబంధం ఎక్కడ నుంచి తేగలం! వాళ్ళని వచ్చి పిల్లని చూసుకోమని లెటర్ వ్రాయండి. దాన్నేం అడక్కండి. పిల్లకేం తెలుసు వాళ్ళ బాగో

గులు. పెద్దవాళ్ళు చూసుకోవాలి గాని' అంది అమ్మ నేను ఎవరికీ ఎదురు చెప్పలేదు సరే చూద్దాం ఆ అబ్బాయి ఎలావుంటాడో అనుకున్నా మనస్సులో.

ఒక రోజు ఇంటర్ రిజల్ట్స్ వచ్చాయి. ప్యాసయ్యానని ఎంతో సంతోషించాను. 'అమ్మా నాకు ఇంటర్లో ఫస్టుక్లాసుకూడా వచ్చిందే బి.ఏ. చదువుతాను ఇప్పుడే పెళ్ళి వద్దు' అమ్మతో అన్నాను. 'చాలు, చాల్లే, బి.ఏ. చదువుతావా? ఇంకానయం. నీ తర్వాత ఇద్దరాడ పిల్లలకి పెళ్ళిళ్ళు చెయ్యాలి. అక్కయ్య కలా కలిసొచ్చింది చదివింది. నీకు కుదరదు. ఇటు బి.ఏ.లు ఎమ్.ఏ.లు చెప్పించి అటు కట్నం ఇచ్చి పెళ్ళి చెయ్యగల గొప్ప వాళ్ళు కారు నీ పుట్టింటి వాళ్ళు. ఇంతటితో చాలు, బుద్ధిగా పెళ్ళి చేసుకుని అత్తారింటిలో మంచి పేరు తెచ్చుకో' అమ్మ గట్టిగా కసిరింది నన్ను.

పెళ్ళి చూపులకి మా అత్తగారు, మామగారు, పెళ్ళయిన ఆడబడుచులు ఇద్దరు, పెళ్ళికాని ఆడబడుచులిద్దరు, పెళ్ళయిన బావగార్లిద్దరు, తోడికోడలిద్దరు, పెళ్ళికాని మరుదులిద్దరు, పెళ్ళికొడుకుతో సహా మొత్తం పదమూడు మంది వచ్చారు. అందరూ ఎంతో మంచిగా నాతో మాట్లాడారు. పెళ్ళికొడుకు కొంచెం నల్లగా వున్నా ముఖం కళగానే వుంది. చాల్లే నామొఖానికి ఇంత కన్నా మంచి సంబంధం వీళ్ళు ఏం చూడగలరను కున్నా నాలో.

'చాలా పెద్దకుటుంబం. సుశీల పనిచెయ్యగలదో లేదో అక్కడ. ఉమ్మడి కుటుంబం అంటే మాటలు కాదు. అందర్నీ మెప్పించాలి. పోనీ మనకి వద్దని రాసేద్దామా?' అన్న నాన్నగారితో 'చాల్లెండి, మంచి సంబంధం వదులు కుంటామా? ఉమ్మడి కుటుంబమయితే నేం? తలోకరు తలోపనీ చేసుకుంటారు. ఇంక సందేహించక ముహూర్తం పెట్టించమని వ్రాయండి. వాళ్ళ ఆచారం ప్రకారం వాళ్ళే పెట్టిస్తామని అన్నారుగా' అంది అమ్మ. నాకు లోపల భయంగానే వుంది. ఆ కుటుంబంలో నేను ఇమిడి అందరి మెప్పు పొందగలనా అని! ఈ పెళ్ళి వద్దని చెప్పే ధైర్యం నాలో లేదు. పోనీ ఈ పెళ్ళి అయ్యాకైనా నేను సుఖపడతా నేమో! హాయిగా బయట సరదాగా తిరగవచ్చు ఆయనతో అనుకున్నా.

పెళ్ళి ఒక మోస్తరుగా చేసారు మావాళ్ళు. పెళ్ళి


## In Tirupur

**For GENUINE AYURVEDIC MEDICINES**

**AND**

**BEST TREATMENT**

**Dr. A. Prakash, B. A. M.**

**KOTTAKKAL ARYA VAIDYA SALA**

**Agency: 98, Easwaran Koil Street,**

**TIRUPUR - 638 604.**

చూపుతున్నప్పుడు ఎంతో అభిమానంతో మాట్లాడిన అత్తారింటివాళ్ళ స్వభావాలు మెల్లిగా బయట పడ్డాయి. వాళ్ళందరూ తేనె పూసిన కత్తులు. తడిగుడ్డతో గొంతు కోసేరకాలు. ఎవరైనా వచ్చినప్పుడు ఎంతో కలివిడిగా అందరూ కలిసి మెలిసి వున్నట్లుగా మాట్లాడి ఆవచ్చిన వాళ్ళు వెళ్ళాక సాధించి చంపేవాళ్ళు. మా మామగారిది పెద్దగొంతే. ఇంటిలో ఆడవాళ్ళది పెద్దగొంతుకతే, మాట వినిపించని గొంతునాది ఒక్కటే. మా పుట్టింటిలో నిశ్శబ్దంగా వుండి ఎవరిపనులు వాళ్ళు చేసుకొనే వాళ్ళము. ఎప్పుడైనా అమ్మగొంతు వినిపించేది తప్పితే మిగతా వాళ్ళ గొంతులు వినిపించేవి కావు. ప్లాను ప్రకారంపనులు జరిగిపోయేవి. రాత్రిళ్ళు త్వరగా పడుకుని ప్రొద్దున్నే త్వరగా లేచేవాళ్ళము. ఇక్కడ అంతా వ్యతిరేకమైన పద్ధతి. ప్లాను ప్రకారం పనులు జరగవు సరికదా, రాత్రిళ్ళు ఆలస్యంగా పడుకోవటాలు ప్రొద్దున్న ఒకొక్కళ్ళూ ఆలస్యంగా లేవటాలు. ఒకంతట పనులు తెమిలేవి కావు. కాపరానికి వచ్చిన మొదటి రోజురాత్రి ఆయనకాళ్ళకి దణ్ణం పెట్టబోయాను వంగి మాగదిలో. 'ఈ సినిమాళ్ళలాగా ఇలాంటివి నాకు నచ్చవు. దణ్ణంపెడితేనే గౌరవం వున్నట్లా, లేకపోతే లేనట్లా' అంటూ ఒక్కలాగు లాగారు మంచం మీదికి. నేను బిత్తరపోయి చూసి ఆయన మోటుతనానికి లోలోపల చాలా బాధ పడ్డాను. ఇంటిలో అందరిమాటల్లో సున్నితనం లేదు. మోట మాటలు మోట పద్ధతులు, పగలబడి నవ్వటాలు, అసహ్యకరమైన, అసభ్యమైన జోక్స్ వేసుకోవటాలు ఒకటేమిటి, నేను పెరిగినపద్ధతికి ఇక్కడ చూస్తున్న పద్ధతులకి సహస్రాంశము లేదా కన్పించింది. కొంచెం గట్టిగానవ్వుతూంటే అమ్మ 'ఏమిటా పెద్దనవ్వులు అలానవ్వకూడదని' తిట్టేది. మరి ఇక్కడ నవ్వులు చూచి అమ్మ ఏమనుకుంటుందో అనుకునేదాన్ని.

పెళ్ళి అయిన నెలకి కొంచెం ధైర్యంచేసి ఆయన్ని అడిగాను మెల్లిగా. 'ఏమండీ ఈ హైద్రాబాద్‌లో చూడ తగిన ప్రదేశాలు ఎన్నోవున్నాయట. ఎప్పుడైనా తీసుకెళ్ళండీ. మీతో సరదాగా తిరగాలని వుందండీ', అన్నాను. 'చూడు మా అమ్మకి, నాన్నగారికి ఆడవాళ్ళు బయట తిరగడం ఇష్టం లేదు, వాళ్ళ మాటప్రకారం వుండాల్సిందే' అన్నారు. 'మరి మీ చెల్లెళ్ళూ, మిగతా ఆడవాళ్ళమాట' అన్నాను. 'అదివాళ్ళ మొగుళ్ళ ఇష్టం ఇది నా ఇష్టం. ఎవరైనాసరే వాళ్ళ మొగుళ్ళు చెప్పినట్లు వినాల్సిందే. నువ్వు అత్తవారింటిలో కాపరం చెయ్యడానికి వచ్చావుకాని, నేను అత్తవారింటిలో కాపరం చెయ్యటం లేదు. ఇల్లరికం వెళ్ళిన వాళ్ళ సంగతి అది వాళ్ళ ఖర్మ. నేను చెప్పినట్లు వినాల్సిందే జాగ్రత్త' అన్నారు.

అత్తవారింటిలో మిగతావాళ్ళందరూ ఎక్కడికో అక్కడికి తిరిగివస్తూవుండేవారు. పెళ్ళయిన ఆడబడుచులు అప్పూళ్ళోనే వుండటం వలన వాళ్ళూ వస్తూపోతూ వుండేవాళ్ళు. ఇంటిలో పెద్దవాళ్ళు కాక పిల్లలు పదిహేను మందిదాకా వుండేవాళ్ళు ప్రొద్దున్న లేస్తే గందరగోళం కేకలతో ఇల్లు హోరెత్తిపోయేది. తెల్లవారు ఝామున నాలుగు గంటలకి లేచినదాన్ని తిరిగి రాత్రి పన్నెండు గంటలకి పడుకొనేదాన్ని. పుట్టింటిలో ఎప్పుడైనా సరదాగా సినిమాకి వెళ్ళేదాన్ని అందరితో, ఇక్కడ దానికి కూడా నోచుకోలేదు. బండెడు చాకిరీతప్పితే నాకు వేరేసరదా లేదు.

పెళ్ళయిన మూడునెలలకి నేను అమ్మని అవుతున్నానని తెలుసుకుని సంతోషంతో ఎలాచెప్పాలా ఆయనకని సిగ్గుపడుతూ ఎదురుచూసాను ఆయన రాకకోసం. గబగబా గదిలోకెళ్ళిన ఆయన దగ్గరగావెళ్ళి మెల్లిగా భుజంమీదికి చెయ్యిపోనించి చెవులో చెప్పబోయాను. ఒక తోపుతోసి 'ఏమిటా పిచ్చివేషాలు, సరిగ్గా చెప్ప లేవా ఏంటి? ఇది పదిమంది తిరిగే కుటుంబం. ఇలాంటి పిచ్చివేషాలు పిల్లలు చూస్తే బావుండదు. వెధవ సినిమాలు చూడకుండా వుంటేనే ఇలావుంటే ఇంక చూస్తే ఎలా తయారవుతావో, ఏమిటో చెప్పేడు' అన్నారు. అంతే, నాలోని ఉత్సాహం నీరు కారిపోయి ఉబికి ఉబికి ఏడుపొచ్చింది.

(సశేషం)

---

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రం బాధ్యులు కాదు. —సంపాదకుడు.